క్లుప్తంగా...

ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకున్న సంత్‌రాహుల్‌దాస్ బాబా

గోల్కొండ: గోల్కొండలోనిమహంకాళీ అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. లంగర్‌హౌస్ మఠానికి చెందిన సంత్ రాహుల్‌దాస్ బాబా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఆలయ పూజారి బి.సురేష్‌చారి, అమ్మవారి వృత్తిపని వారి మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారి తదితరులున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నాంపల్లి: దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ మూడవ బీఈసీ సమావేశం మంగళవారం హైదరాబాద్‌లోని సంఘ్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో కార్మికుల సమస్యలపై విస్తృతంగా చర్చించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని హైదరాబాద్ బ్రాంచ్ చైర్మన్ మధుసూదన్, కార్యదర్శి దశరథ్ కుమార్ చెప్పారు. ఎస్‌సీఆర్ఈ సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ డిప్యూటీ డివిజనల్ సెక్రెటరీ వేగి మురళీకృష్ణ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ బ్రాంచ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బ్రాంచ్ కోశాధికారిగా వినోద్‌కుమార్, వర్కింగ్ చైర్మన్ గొల్ల శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యవర్గ సభ్యులు, వర్కింగ్ కమిటీ సభ్యులు, మాజీ డివిజనల్ అధ్యక్షులు ఎస్‌వీఎస్ చౌదరి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్



ఎత్తేబర్ చౌక్ వద్ద తనిఖీలు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ మదన్‌లాల్

యాకుత్‌పురా: నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ ఆదేశాల మేరకు సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మదన్‌లాల్ తెలిపారు. మంగళవారం స్టేషన్ పరిధిలోని ఎత్తేబర్ చౌక్ వద్ద సెల్‌ఫోన్ మాట్లాడుతూ, చెవిలో ఇయర్ ఫోన్ పెట్టుకొని పాటలు వింటూ డ్రైవింగ్ చేసే వారిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వాహన ప్రమాదాలను నివారించేందుకు ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ ప్రత్యే డ్రైవ్‌లో ఎస్సైలు శ్రీహరి, అమనాథ్‌రెడ్డి, భాస్కర్, వంశీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ బ్యాంకులను జాతీయం చేయాలి



ధర్నాలో కెనరా బ్యాంకు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు రాంబాబు

అబిడ్స్: అన్ని ప్రైవేట్ బ్యాంకులను జాతీయం చేయాలని ఏఐబీఈఏ ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్ యూనియన్స్ సెల్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అబిడ్స్ కరూర్ వైశ్య బ్యాంకు వద్ద ఆ బ్యాంకుతో పాటు కెనరా బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రాంబాబు, సమద్‌ఖాన్, వినయ్‌కుమార్, గొరిగె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ షాట్‌గన్ షూటింగ్‌లో తెలంగాణ విజయం



అబిడ్స్: సౌత్‌జోన్ షాట్‌గన్ షూటింగ్‌లో హైదరాబాద్ షూటర్‌లు తమ ప్రతిభను కనబరిచి విజయం సాధించారు. 16వ సౌత్‌జోన్ షాట్ గన్ షూటింగ్ చాంపియన్‌షిప్–2025 పోటీలు చెన్నైలో నిర్వహించారు. తెలంగాణ నుంచి ప్రాతినిథ్యం వహించిన తుమ్మలపల్లి అగస్త్యరెడ్డి బంగారు పతకం, వెన్న నవీన్‌కుమార్, కాంస్యపతకాన్ని సాధించారు. ఈ ఇద్దరు షూటర్‌లు నగరంలోని చేతన్‌రెడ్డి శిష్యుడి ఆధ్వర్యంలో శిక్షణ పొందారు. విజయం సాధించిన ఇద్దరికి అవార్డులు అందజేసి ప్రశంసించారు.

దీపావళికి మీరాలంమండి ఆలయం ముస్తాబు

- ఈ నెల 18న ధన్‌తేరస్‌తో వేడుకలు ప్రారంభం
- 20న అమ్మవారి ఖజానా పంపిణీ
- భక్తులకు అసౌకర్యాలు లేకుండా తగిన ఏర్పాట్లు



అమ్మవారు



మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయం

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. నిజాం కాలంలో నగర ప్రజలకు కూరగాయలు, ఆకు కూరలు అందించే ప్రధాన కూరగాయల మార్కెట్‌గా కొనసాగిన మీరాలంమండి కూరగాయల మార్కెట్‌లో ఏడాది పొడవునా అమ్మవారికి నిత్యం పూజలు జరుగుతాయి. ఇక ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలు, దసరా శరన్నవరాత్రి వేడుకలతో పాటు దీపావళి వేడుకలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఇక్కడి భక్తులు చెబుతున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు ఇక్కడ దీపావళి వేడుకలు జరగనున్నాయి.

ధన్‌తేరస్‌తో దీపావళి వేడుకలు ప్రారంభం..

18న ధన్‌తేరస్‌ను పురస్కరించుకొని తెల్లవారుజామున 4 గంటల నుంచి అమ్మవారికి మహాభిషేకం, అలంకారం, శ్రీచక్ర అర్చన, ఆంజనేయస్వామికి అభిషేకం, మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలతో పాటు సాయంత్రం 6 గంటలకు 108 అష్టోత్తర దిపోత్సవం కార్యక్రమాలు ఉంటాయి. 19న నరక చతుర్దశిని పురస్కరించుకొని ఉదయం 5 గంటల నుంచి మహాభిషేకం, అలంకారం, ఆంజనేయ స్వామికి అభిషేకం తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయి. సాయంత్రం 6 గంటలకు 108 అష్టోత్తర దిపోత్సవం తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయి. అలాగే ఈ నెల 20న దీపావళిని పురస్కరించుకొని రాత్రి 12:05 గంటలకు పంచహారతి, సామూహిక హారతి ఉంటుంది. అనంతరం అమ్మవారి ఖజానా పంపిణీ ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఖజానా పంపిణీ చేస్తాం...



శతాబ్దాలుగా మీరాలం మండిలో అమ్మవారికి పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మహిళా భక్తులు నిత్యం పూజలు నిర్వహిస్తున్నారు. భక్తుల కోరిన కోర్కెలు తీర్చే భక్తులకు దీపావళి పర్వదినం సందర్భంగా అమ్మవారి ఖజానా పంపిణీ చేస్తాం. ఇందుకు ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేశాం.

– గాజుల అంజయ్య, ఆలయ చైర్మన్

దీపావళికి నిరంతర నీటి సరఫరా చేయాలి



వినోద్ భార్గవ్‌కు ఆహ్వానపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

చార్మినార్: దీపావళిని పురస్కరించుకుని ఆరు రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక పూజల్లో పాల్గొనాలని కోరుతూ జలమండలి ఇన్‌చార్జి డైరెక్టర్ వినోద్ భార్గవ్‌కు చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయ ట్రస్టీ సూర్య ప్రకాష్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సెంట్రల్ కమిటీ సభ్యుడు ప్యారసాని వెంకటేష్ ఆహ్వానపత్రం అందజేశారు. మంగళవారం ఖైరతాబాద్‌లోని ప్రధాన జలమండలి కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఈ నెల 18 నుంచి 23 వరకు దీపావళి వేడుకలు నిర్వహించనున్నామని..చార్మినార్ పరిసరాల్లోని ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లలో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని డైరెక్టర్‌ను కోరామన్నారు. అలాగే వారం రోజుల పాటు పాతబస్తీలోని అన్ని ప్రాంతాల్లో నిరంతర నీటి సరఫరా కొనసాగించాలని కోరామన్నారు.

శ్యాంరావుకు మహాత్మా గాంధీ శాంతి పురస్కారం



చాంద్రాయణగుట్ట: మూడు దశాబ్దాలుగా ప్రజా సేవలో కొనసాగుతున్న చాంద్రాయణగుట్ట నియోజకవర్గానికి చెందిన గ్రేటర్ కాంగ్రెస్ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు కాశమోని శ్యాంరావు ముదిరాజ్ మహాత్మా గాంధీ శాంతి పురస్కారాన్ని అందుకున్నాడు. మహాత్మా గాంధీ జయంత్యుత్సవాల ముగింపులో భాగంగా సహకార్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో మంగళవారం ఆయనకు రాష్ట్ర శాసన మండలి సభ్యుడు మధుసూదనాచారి, హైకోర్టు మాజీ న్యాయమూర్తి వామనరావు, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి పురస్కారాన్ని అందజేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న కృషిని గుర్తించి ఈ పురస్కారం అందించడం గర్వంగా ఉందన్నారు. సంస్థ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బత్తుల హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

'మనుగడ' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వేదగిరి రాంబాబు చిరస్మరణీయుడని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సింహప్రసాద్ సాహిత్య సమితి ఆధ్వర్యంలో మా కథలు, సింహప్రసాద్ రచించిన 'మనుగడ'పుస్తకావిష్కరణ సభ మంగళవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వేదగిరి రాంబాబు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..తెలుగు సీరియల్ రచయితగా అనేక కథలు, నవలలు, చరిత్ర, ఆధ్యాత్మిక గ్రంథాలు రాసిన రచయితగా పేరు ప్రఖ్యాతలు పొందారని తెలిపారు. ప్రముఖ రచయిత, కవి, విమర్శకులు విహారి మాట్లాడుతూ..వేదగిరి రాంబాబు అనేక మంది యువ రచయితలను ప్రోత్సహించారని పేర్కొన్నారు. అనంతరం పుల్ల రామాంజనేయులకు డాక్టర్ వేదగిరి రాంబాబు బాలసాహిత్య పురస్కారం, రచయిత స్ఫూర్తికి డాక్టర్ వేదగిరి రాంబాబు కథానిక పురస్కారం ప్రదానం చేశారు. సాహితీవేత్త సుధామ, సంస్థ ప్రతినిధులు ప్రసాద్, వాణిశ్రీ పాల్గొన్నారు.

దేశం సుభిక్షంగా ఉండాలని 19 రోజుల పాదయాత్ర



ఎస్.పి.నరేష్ నాయుడు

అఫ్జల్‌గంజ్: దేశం సుభిక్షంగా ఉండాలని ఓ వ్యక్తి 19 రోజుల పాదయాత్ర నిర్వహించాడు. అబిడ్స్‌కు చెందిన ఎస్.పి.నరేష్‌నాయుడు అబిడ్స్ నుంచి గత నెల 25న పాదయాత్ర ప్రారంభించి కాలి నడకన మంగళవారం మహారాష్ట్రలోని కొల్హాపూర్ మహాలక్ష్మి ఆలయానికి చేరుకున్నారు. ఒకే వ్యక్తి కాలినడకన 19 రోజులు ప్రయాణించాడు. ఈ సందర్భంగా నరేష్‌నాయుడు మాట్లాడుతూ..అబిడ్స్ నుంచి పటాన్‌చెరువు, సంగారెడ్డి, జహీరాబాద్, బీదర్, సోలాపూర్ మీదుగా 600 కిలోమీటర్లు కాలినడకన అమ్మవారి ఆలయానికి చేరుకున్నట్లు తెలిపారు. దేశం సశ్యశ్యామలంగా, సుభిక్షంగా ఉడాలని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా మహాత్మాగాంధీ జయంతి ముగింపు ఉత్సవాలు



సుల్తాన్‌బజార్: సహకార్ స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో మహాత్మా గాంధీ జయంతి ముగింపు ఉత్సవాలను పురస్కరించుకొని అంతర్జాతీయ అహింస దినోత్స వం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసన మొదటి సభాపతి, శాసనమండలి సభ్యులు మధుసూదనాచారి హాజరై మాట్లాడారు. మహాత్మాగాంధీ మన దేశానికి స్వాతంత్రం మాత్రమే కాకుండా సత్యం, అహింస మార్గాలను చూపించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి, అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ కోర్టు మాజీ చైర్మన్ న్యాయమూర్తి జస్టిస్ వామన్‌రావు మాట్లాడుతూ..గాంధీజీ సిద్ధాంతాలను అనుసరించి ఆయన ఆశించిన సుసంపన్నమైన భారతదేశం కోసం కృషి చేయాలన్నారు. అమీర్ గ్లోబల్ పీస్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఫరూక్ అలీఖాన్ మాట్లాడుతూ..గాంధీ జీవితంలోని ఎన్నో ఘట్టాలను ఆయన త్యాగనిరతిని మనందరం ఆచరించాలన్నారు. కో ఆర్డినేటర్లు కుమారి జయనబ్ ఫాతిమా, జి.వేణుగోపాల్, బిచ్చుకారి సూర్య, కుమారి బి.అక్షిత, బారవి కుమారి, ముకారాణి, జవారియ తహసీన్ పాల్గొన్నారు.

'షేక్‌పేట్‌లో కాంగ్రెస్ పటిష్టంగా ఉంది'

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ అత్యంత పటిష్టంగా ఉందని ఆ పార్టీ షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఆయన షేక్‌పేట్ డివిజన్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్వయంగా రాష్ట్ర మంత్రులు జి.వివేక్, పొన్నం ప్రభాకర్ షేక్‌పేట్ డివిజన్‌లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్నారన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో సాయినాథ్, లడ్డూ తదితరులున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

విజయనగర్‌కాలనీ: అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరిని ఆసిఫ్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. అడ్మిన్ ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..గుడిమల్కాపూర్ సిటీ గ్రాండ్ హోటల్ సమీపంలో ఆసిఫ్‌నగర్ పోలీసులు తనిఖీ చేపట్టారు. విజయనగర్‌కాలనీకి చెందిన సఫ్దార్‌ఖాన్ (17), సాబేర్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఖబీర్(22)లు ఒక్కొక్క క్వింటా చొప్పున తమ హోండా యాక్టీవాలపై వెళ్తుండగా గుడిమల్కాపూర్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. ఆసిఫ్‌నగర్ అంజుమాన్‌లోని రవూఫ్, అక్బర్‌కు అందజేస్తున్నట్లు విచారణలో తెలిపారు. ద్విచక్ర వాహనాలతో పాటు సఫ్దార్‌ఖాన్, ఖబీర్‌ను అదుపులోకి తీసుకుని 2 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలలో సివిల్ సప్లయ్ అధికారి మోహన్‌సాయి, సిబ్బంది పాల్గొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

జీహెచ్‌ఎంసీ అధికారుల శానిటేషన్ స్పెషల్ డ్రైవ్



రహదారులపై పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

అబిడ్స్: రహదారులపై పేరుకుపోయిన చెత్త, మట్టికుప్పలు, ఇతరాత్ర వ్యర్థాలను తొలగించేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ–14వ సర్కిల్ కార్యాలయం పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. డిప్యూటీ కమిషనర్ ఉమా ప్రకాష్ పర్యవేక్షణలో ఏఎంఒహెచ్ వెంకటరమణ నేతృత్వంలో గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని వార్డుల వారీగా అధికారులను ఇన్‌చార్జులుగా నియమించి ఈ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ప్రధాన రహదారులు, ఫోర్‌లేన్ రహదారులలో ఈ శానిటేషన్ డ్రైవ్ జరుగుతుంది. రాంకీ వారి ఆరు వాహనాలు జోనల్ కమిషనర్ కార్యాలయం నుంచి ఆరు వాహనాలను కేటాయిస్తుండడంతో ప్రతి డివిజన్‌కు ఒక వాహనాన్ని ఏర్పాటు చేసి సిబ్బంది ఆయా వాహనాల ద్వారా రహదారులపై పేరుకుపోయిన చెత్త, మట్టికుప్పలు, చెట్టు కొమ్మలు, ఇతరాత్ర వ్యర్థాలను తొలగిస్తున్నారు. నియోజకవర్గం పరిధిలోని సెంట్రల్ లైబ్రరీ, గాంధీభవన్, ఈఎస్‌టీ, కింగ్‌కోఠి, సుల్తాన్‌బజార్ మెటర్నిటీ దవాఖానా, ఉస్మానియాతోపాటు జుమ్మెరాత్‌బజార్, శివలాల్‌నగర్, చార్‌కందిల్, మొజంజాహి మార్కెట్ తదితర ప్రాంతాల నుంచి చెత్తను తొలగించే పనులను చేపట్టారు.

జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఉమా ప్రకాష్ పర్యవేక్షణ..

గోషామహల్ నియోజకవర్గంలో జరుగుతున్న స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని జీహెచ్‌ఎంసీ–14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఉమాప్రకాష్ పర్యవేక్షించారు. ఆమె సర్కిల్ ఏఎంఒహెచ్ వెంకటరమణతో కలిసి ప్రతి నిత్యం తెల్లవారుజాము నుంచి ప్రాంతాల్లో తిరుగుతూ చెత్త తరలింపు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. అశ్రద్ధగా చెత్తను రహదారిపై వేసే వారికి జరిమానాలు విధిస్తున్నారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ..రహదారులు పేరుకుపోయిన చెత్తను తొలగించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వి. కర్ణన్ ఆదేశాల మేరకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

ట్రాఫిక్ సమస్య తీరేదెన్నడో..?

జియాగూడ: జియాగూడ జాతీయ రహదారిలోనే మేకల మండి గొర్రెలు, మేకల విక్రయాలు జరుగుతుంటాయి. మరో రహదారిలో జీవాల వద్ద కొనుగోలుదారుల వాహనాలు రోడ్డు పై పార్కింగ్, చెత్త డంపింగ్ యార్డ్‌కు వచ్చే ట్రక్కులు, భారీ చెత్త లారీలు 400లకు పైగా వస్తుంటాయి. దీంతో అవి లోపలికి వెళ్లే వరకు రెండు దిక్కులా ట్రాఫిక్ జామ్‌తో ప్రతిరోజూ వాహనదారులు నరకం చూస్తున్నారు. గతంలో పురానాపూల్ నుంచి అత్తాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి ప్రాంతాలకు వెళ్లేందుకు ఎంతో సౌకర్యంగా ఉండేది. పాతబస్తీ, అఫ్జల్‌గంజ్ ప్రాంతాల గుండా పురానాపూల్ చౌరస్తా మీదుగా జాతీయ రహదారి గుండా వెళ్లేవారు. ప్రస్తుతం ఈ జాతీయ రహదారి గుండా వెళ్లాలంటే జంకే పరిస్థితి. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



జాతీయ రహదారిలో ట్రాఫిక్ జామ్



మండి రహదారి ఒకటి మూత పడటంతో ఒకే దారిలో గంటల తరబడి

గోల్కొండలో ఎమ్మెల్యే కౌసర్ పర్యటన



గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకీ, గోల్కొండ డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు తమ ప్రాంత సమస్యలను వివరించారు. బంజారి దర్వాజాతో పాటు ఫతేదర్వాజా వద్ద కూడా ప్రతినిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతున్నాయన్నారు. నల్లాలో వస్తున్న నీరు తాగునీరు సరిపోవడం లేదని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..రిజర్వాయర్‌లో నీటి లెవల్ తక్కువగా ఉండడంతో లో ప్రెజర్‌లో నీరు వస్తున్నాయన్నారు. ట్రాఫిక్ కష్టాలను తీర్చడానికి త్వరలోనే తాను ట్రాఫిక్ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తానన్నారు. ఏదేమైనా సమస్యలను పరిష్కరించడమే తమ లక్ష్యమన్నారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు సయ్యద్ ఆజామ్ తదితరులున్నారు.

జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం ఖాయం



షేక్‌పేట్‌లో పర్యటిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

గోల్కొండ: రాష్ట్రంలో కల్లిబొల్లి వాగ్దానాలు, హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో నూకలు చెల్లాయని బీఆర్‌ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన షేక్‌పేట్ డివిజన్‌లో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమాన్ని పక్కకు పెట్టి కేవలం అవినీతికి పాల్పడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ఆయన అన్నారు. అదే విధంగా బీజేపీ నేటికీ అభ్యర్థిని ప్రకటించడంలో లెక్కలు పెట్టుకుంటుందన్నారు. బీఆర్‌ఎస్ షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు ప్రదీప్, షకీల్, ఎల్లేష్, మోయిజ్‌ఖాన్ తదితరులున్నారు. అనంతరం ఆయన షేక్‌పేట్‌లో ఏర్పాటు చేయనున్న బీఆర్‌ఎస్ డివిజన్ పార్టీ కార్యాలయాన్ని పరిశీలించారు.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవం



అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

గౌలిపురా: పటేల్‌నగర్‌లోని రేణుకాఎల్లమ్మ ఆలయంలో నూతన ఆలయ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 10 గంటలకు ఓగ్గు పూజారులతో రేణుకాఎల్లమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు బస్తీల ప్రజలు అమ్మవారి బోనాలను సమర్పించారు. ఈ మహోత్సవాల్లో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పునఃనిర్మాణ దాతలు అల్లం మధుశ్రీ, అల్లం శ్రీనివాస్ రావు దంపతులు, ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

చట్టాలపై అవగాహనతోనే మహిళా అభ్యున్నతి సాధ్యం



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ సీతయ్య

చాంద్రాయణగుట్ట: చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారానే మహిళా అభ్యున్నతి సాధ్యమవుతుందని ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య సూచించారు. జంగమ్మెట్‌లోని రవీంద్రనాయక్‌నగర్‌లో మంగళవారం సీడీఈడబ్ల్యూ(సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్) ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ..మహిళల భద్రత కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. సైబర్ క్రైమ్, డ్రగ్స్, షీ టీమ్ విషయాలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూనే ఉన్నామన్నారు. ముఖ్యంగా గృహ హింస విషయంలో మహిళలు వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజేశ్వర్ రెడ్డి, కాలనీవాసులు శంకర్ నాయక్, కృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏకగ్రీవం



ఎన్నికైన నూతన కార్యవర్గం

నాంపల్లి: ప్రసార భారతి ప్రధాన కార్యాలయంలోని ఆకాశవాణి ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ హైదరాబాద్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. సహకార సంఘాల ఎన్నికల అధికారిగా సీనియర్ ఇన్‌స్పెక్టర్ గిరిబాబు రాజ్ నేత వ్యవహరించారు. మంగళవారం ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. నూతన సంఘం అధ్యక్షుడిగా ఎస్.రమేష్, ఉపాధ్యక్షుడిగా వై.అశోక్ రాజ్, కార్యదర్శిగా కె.సీతారామ్, కోశాధికారిగా వి.ఫణికుమారి, కార్యవర్గ సభ్యులుగా కోడి నిలిమా, జి.కార్యవర్ధన్, ఎం.జగదీష్, ఎల్.వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం ఐదేళ్లు పనిచేస్తుంది. ఎన్నికైన కార్యవర్గానికి సహకార శాఖ జాయింట్ రిజిస్ట్రార్ ప్రసన్న శుభాకాంక్షలు తెలియజేశారు.

మద్యం మత్తులో మూసీలోకి దిగి వ్యక్తి మృతి

బహదూర్‌పురా: మద్యం మత్తులో మూసీలోకి దిగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కామాటిపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం..కామాటిపురా ఉస్మాన్‌బాగ్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఫర్హాన్ (25) అదే ప్రాంతానికి చెందిన హుసేన్ గోరు అనే వ్యక్తి ఇంట్లో అద్దెకు ఉంటాడు. ఇద్దరూ వంట పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. సోమవారం అర్ధరాత్రి ఇద్దరు కలిసి బయటికి వెళ్లారు. వారితో అక్రమ్ గోరు అనే వ్యక్తి జత కలిశారు. ముగ్గురు కలిసి సమీపంలోని మూసీ నది సమీపంలోని ఖదీర్ పియా దర్గా సమీపంలో కూర్చుని మద్యం తాగారు. అనంతరం మహ్మద్ ఫర్హాన్ ఈత కొడతానని నదిలోకి దిగాడు. వెంట ఉన్నవారు వారిస్తున్నా వినకుండా మూసీలోకి దిగి బురదలో చిక్కుకున్నాడు. ఈ దృశ్యాన్ని హుసేన్ గోరు తన ఫోన్లో చిత్రీకరించాడు. కొద్దిసేపటి తర్వాత నీటిలో మునిగిపోవడంతో అక్కడి నుంచి వెనుదిరిగి వచ్చారు. దీంతో ఫర్హాన్ కుటుంబసభ్యులు కామాటిపురా పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్ బృందాలు మూసీలో గాలించగా ఖదీర్ పియా దర్గా సమీపంలో ఫర్హాన్ మృతదేహం లభించింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.